


TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్



WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాదాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354



హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-267 | పేజీలు:-4 | శుక్రవారం 11-09-2026
Hydrabab | Editer name : varudu sujatha | volume:01, | issue:267 | pages:04 | Friday - 11-09-2026


## ఇమ్రాన్ ఖాన్ చనిపోయారా? పాక్ జర్నలిస్టు సంచలన వ్యాఖ్యలు.. నిజమెంత?

- 2023 నుంచి జైల్లో ఉన్న ఇమ్రాన్ ఖాన్
- ఆయన ఆరోగ్యంపై పార్టీ, కుటుంబంలో తీవ్ర ఆందోళన
- చనిపోయి ఉంటారని జర్నలిస్ట్ వజాహత్ సయీద్ ఖాన్ సంచలన వ్యాఖ్యలు
- సైన్యంలోని సీనియర్ వర్గాలు అనధికారిక సమాచారంతో చెప్పినట్లు వెల్లడి
- ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతివ్వకుంటే లాంగ్ మార్చ్ చేపడతామన్న పీటీఐ పార్టీ



పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆయన జైల్లోనే మృతి చెంది ఉండొచ్చంటూ పాకిస్థాన్‌కు చెందిన ఓ సీనియర్ జర్నలిస్టు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. అయితే ఈ వాదనకు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. - మిగతా 2 లో

## 26 ఏళ్ల తర్వాత బట్టబయలైన క్లింటన్ రహస్యం

- 26 ఏళ్ల నాటి రహస్యాన్ని బయటపెట్టిన సీనియర్ జర్నలిస్ట్ సూసన్ పేజ్
- 2000లో పాక్ పర్యటనకు క్లింటన్ డెకాయ్ విమానం వాడారని వెల్లడి
- ఇటీవల తుర్కియేలో ట్రంప్ కూడా ఇలాంటి వ్యూహాన్నే అనుసరించారని కథనం
- క్లింటన్ యంత్రాంగం జర్నలిస్టులకు ముందుగా చెప్పగా, ట్రంప్ సర్కార్ చెప్పలేదు
- ఇద్దరి పర్యటనలకూ తీవ్ర భద్రతాపరమైన ముప్పులే కారణమని స్పష్టీకరణ



అమెరికా అధ్యక్షుల భద్రతకు సంబంధించి 26 ఏళ్లుగా గోప్యంగా ఉన్న ఒక కీలక రహస్యం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. 2000వ సంవత్సరంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ పాకిస్థాన్ పర్యటనకు వెళ్లినప్పుడు, - మిగతా 2 లో

# గోదావరి జలాల వినియోగంపై
# సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

- గోదావరి నది జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయం
- ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి నీటిని లిఫ్ట్ చేయాలని సీఎం ఆదేశం
- కాళేశ్వరం బ్యారేజీల భద్రతపై ఎన్డీఎస్ఏ సూచనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం
- భూ నిర్వాసితులకు పరిహారం వెంటనే చెల్లించేందుకు కార్యాచరణకు ఆదేశం



2లో

గోదావరి నది జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా

## ఆన్‌లైన్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ



- తెలంగాణలో రేపే 'ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్' పథకం ప్రారంభం: నియోజకవర్గానికి వెయ్యి మందికి లబ్ధి
- బీసీ మహిళల కోసం ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్న ప్రభుత్వం
- విధి విధానాలను రేపు ప్రకటించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (బీసీ) మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం- మిగతా 2 లో

## మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు



- సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడిపై కేటీఆర్ విమర్శల దాడి
- మేం టీ-హబ్ కడితే.. రేవంత్ 'అనుముల హబ్' తెస్తున్నారని ఎద్దేవా
- సీఎం సోదరుడి సంస్థకు రూ. 200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టారని ఆరోపణ
- లక్ష మూలధనం ఉన్న కంపెనీకి భూ కేటాయింపులపై సమగ్ర విచారణకు డిమాండ్
- ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని, కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు అనుముల కొండల్ రెడ్డిపై బీఆర్ఎస్ - మిగతా 2 లో

## కంపెనీల్లో మహిళా బాస్‌లు చాలా తక్కువ.. పార్లమెంటులో కేంద్రం వెల్లడి



- దేశంలోని టాప్ 500 లిస్టెడ్ కంపెనీల్లో కేవలం 9 మందే మహిళా సీఈవోలు
- ఇదే కంపెనీల్లో 25 మంది మహిళా మేనేజింగ్ డైరెక్టర్లు
- మహిళా డైరెక్టర్లను నియమించని సంస్థలకు రూ.71 లక్షల జరిమానా
- మొత్తం కంపెనీల్లో మాత్రం 11 లక్షల మందికి పైగా మహిళా డైరెక్టర్లు

భారత్‌లోని అగ్రశ్రేణి లిస్టెడ్ కంపెనీల్లో అత్యున్నత కార్యనిర్వాహక పదవుల్లో మహిళల- మిగతా 2 లో

# మీరు కొంచెం మారారు:
# మోదీతో ఖర్గే సరదా వ్యాఖ్య

- సుప్రియా సూలే కుమార్తె వివాహ రిసెప్షన్‌లో అరుదైన దృశ్యం
- ప్రధాని మోదీ, కాంగ్రెస్ నేతల మధ్య సరదా సంభాషణ
- రాజకీయాలకు అతీతంగా నేతల మధ్య కనిపించిన స్నేహపూర్వక వాతావరణం



2లో

రాజకీయాల్లో నిత్యం విమర్శలు, ప్రతివిమర్శలతో తలపడే అగ్ర నేతలు, ఒకే వేదికపై ఆత్మీయంగా పలకరించుకోవడం అందరినీ ఆకట్టుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే,

## మహమ్మద్ అలీ జిన్నా.. రాహుల్ గాంధీ రూపంలో మరలా జన్మించారు



- రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే తీవ్ర విమర్శలు
- రాహుల్ రూపంలో జిన్నా పునర్జన్మించారంటూ వివాదాస్పద వ్యాఖ్య
- జార్ఖండ్ ఉద్యోగ నియామకాల్లో అవకతవకలపై సీబీఐ విచారణకు డిమాండ్
- హేమంత్ సోరెన్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్‌కు సవాల్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే తీవ్రస్థాయిలో - మిగతా 2 లో

## ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు

నాణేనికి మరో వైపు చూపిస్తా: జగన్



- ఆగస్టు 17 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు
- పార్టీ ప్రజాప్రతినిధులకు జగన్ దిశానిర్దేశం
- శాసనమండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఎమ్మెల్సీలకు సూచన
- ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుల సమస్యలపై గళమెత్తాలని ఆదేశం
- ప్రజా సమస్యలను మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళతానన్న జగన్

ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తమ గొంతు నొక్కేందుకే చంద్రబాబు నేతృత్వంలోని - మిగతా 2 లో

## ఉప్పాడ తీరంలో సముద్రపు కోతకు చెక్



- ఉప్పాడ తీరానికి రక్షణ కవచం పవన్ సమక్షంలో మద్రాస్ ఐఐటీతో ఒప్పందం
- పవన్ కల్యాణ్ చొరవతో రంగంలోకి మద్రాస్ ఐఐటీ
- రూ.323 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణం
- డిజైన్, డీపీఆర్, పర్యవేక్షణ బాధ్యతలు చూడనున్న ఐఐటీ-మద్రాస్
- ఈ ఏడాది నవంబర్ నుంచి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు

కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న - మిగతా 2 లో

# నేరాల రూపం
# మారింది పోలీసింగ్ మారాలి

- పోలీసులతో చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్
- నేర దర్యాప్తులో 'గోల్డెన్ అవర్' కీలకమని, ఆధారాల పరిరక్షణలో విఫలం కావొద్దని సూచన
- రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశం
- ఇక నుంచి ప్రతీ నెలా పోలీసుల పనితీరుపై పెర్ఫార్మెన్స్ రిపోర్టు విడుదల
- పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం పెంచేలా చర్యలు తీసుకుంటామని హామీ



2లో

మారుతున్న కాలంతో పాటు నేరాల స్వరూపం, స్వభావం పూర్తిగా మారిపోయాయని, అందుకు అనుగుణంగా పోలీసింగ్ విధానాల్లో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
శుక్రవారం 11-09-2026

## ఆన్‌లైన్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ

మొదటిపేజీ తరువాయి - చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్హులైన బీసీ మహిళలకు ఉచితంగా ఆటోమేటిక్ కుట్టు మిషన్లు పంపిణీ చేసే సరికొత్త సంక్షేమ పథకాన్ని రేపు అధికారికంగా ప్రారంభించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. శ్రమను తగ్గించి, వేగంగా పని చేసుకునేందుకు వీలుగా ఈ అధునాతన ఆటోమేటిక్ మిషన్లను అందించబోతున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో వెయ్యి మంది మహిళలకు మిషన్లు అందించబోతున్నారు. లబ్ధిదారుల వయోపరిమితి, కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి, అవసరమయ్యే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల వివరాలను మంత్రి రేపు అధికారికంగా వెల్లడిస్తారు. ఆన్‌లైన్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించే తేదీలను, ప్రక్రియ మార్గదర్శకాలను ప్రకటించనున్నారు.

## గోదావరి జలాల వినియోగంపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి - నీటి ఎత్తిపోతల (లిఫ్ట్) ప్రక్రియను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నీటిపారుదల శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సిఫార్సుల మేరకు ప్రస్తుతం సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో నీటిని నిల్వ చేయడం లేదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలను అధికారులు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలలో కొన్ని లోపాలను గుర్తించినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించగా, ఈ అంశంపై తక్షణమే ఎన్డీఎస్ఏను సంప్రదించాలని సీఎం సూచించారు. దేవాదుల ప్రాజెక్టులో తొమ్మిది పంపుల ద్వారా నీటిని లిఫ్ట్ చేయడం కీలకమని, అక్కడ ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముంపునకు గురయ్యే గ్రామాలు, పెండింగ్ పరిహారం, పునరావాస ప్యాకేజీలపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికలు అందజేయాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన పరిహారం చెల్లిస్తేనే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులను నింపడానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. గట్టు, గుడెందొడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపుపై తగిన అధ్యయనం చేయాలని, గుడెందొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌ను నియమించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కంపెనీల్లో మహిళా బాస్‌లు చాలా తక్కువ.. పార్లమెంటులో కేంద్రం వెల్లడి

మొదటిపేజీ తరువాయి - ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. టర్నోవర్ ప్రాతిపదికన టాప్ 500 కంపెనీల్లో కేవలం 9 మంది మహిళలు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా (సీఈవో), 25 మంది మేనేజింగ్ డైరెక్టర్లుగా (ఎండీ) బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా సోమవారం లోక్‌సభకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ఎంసీఏ21 డేటాబేస్ గణాంకాల ప్రకారం, ఈ 500 కంపెనీల్లో మొత్తంగా 860 మంది మహిళలు బోర్డు సభ్యులుగా, డైరెక్టర్లుగా ఉన్నారు. వీరిలో 738 మంది డైరెక్టర్లు, 67 మంది పూర్తికాల డైరెక్టర్లు, 18 మంది అదనపు డైరెక్టర్లు, 12 మంది నామినీ డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. అలాగే, 22 మంది మహిళలు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లుగా (సీఎఫ్ఓ) బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు మంత్రి వివరించారు. కంపెనీల చట్టం-2013 నిబంధనల ప్రకారం, ప్రతి లిస్టెడ్ కంపెనీ బోర్డులో కనీసం ఒక మహిళా డైరెక్టర్‌ను నియమించడం తప్పనిసరి. ఈ నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత బోర్డు స్థాయిలో మహిళల సంఖ్య పెరిగినప్పటికీ, సీఈవో, ఎండీ వంటి కీలక పదవుల వద్దకు వచ్చేసరికి వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. అయితే, మహిళా డైరెక్టర్లు ఉన్నత నాయకత్వ స్థానాలకు ఎదగడానికి ఎదురవుతున్న అడ్డంకులపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి ప్రత్యేక అధ్యయనం నిర్వహించలేదని, కొత్త విధానాలు లేదా ప్రోత్సాహకాలు ఏవీ ప్రస్తుతం పరిశీలనలో లేవని మల్హోత్రా స్పష్టం చేశారు. మరోవైపు, మహిళా డైరెక్టర్లను నియమించడంలో విఫలమైన కంపెనీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. 2021-22 నుంచి 2025-26 మధ్య కాలంలో నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలకు సంబంధించి మొత్తం 50 ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఆయా సంస్థలపై రూ. 71.01 లక్షల జరిమానా విధించినట్లు మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం క్రియాశీలకంగా ఉన్న మొత్తం కంపెనీల్లో సుమారు 39 లక్షల మంది డైరెక్టర్లు ఉండగా, వారిలో మహిళల సంఖ్య 11.6 లక్షలుగా ఉందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

## మహమ్మద్ అలీ జిన్నా.. రాహుల్ గాంధీ రూపంలో మరలా జన్మించారు

మొదటిపేజీ తరువాయి - ధ్వజమెత్తారు. పాకిస్థాన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అలీ జిన్నా, రాహుల్ గాంధీ రూపంలో పునర్జన్మించారని, జిన్నా కంటే కూడా రాహుల్ అత్యంత ప్రమాదకరమైన నాయకుడని బుధవారం ఆయన విమర్శించారు. ఈ మేరకు తన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. ఝార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన నిరసనల నేపథ్యంలో దూబె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కుంభకోణంపై సీబీఐ విచారణను కాంగ్రెస్ పార్టీ ఎందుకు వ్యతిరేకిస్తోందని ఆయన నిలదీశారు. ప్రధాన నిందితుడు ఝార్ఖండ్ ప్రభుత్వంలోని ఒక సీనియర్ అధికారి నివాసంలో పట్టుబడ్డాడని, ఒకవేళ సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా జరిగితే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు కూడా చిక్కులు తప్పవని ఆరోపించారు. విద్యార్థులకు నిజంగా సంఘీభావం తెలపాలనుకుంటే ఝార్ఖండ్ ప్రభుత్వానికి కాంగ్రెస్ తన మద్దతును వెంటనే ఉపసంహరించుకోవాలని దూబె సవాల్ విసిరారు. లేనిపక్షంలో ఆ పార్టీ జార్జ్ సోరోస్ అజెండాతో పనిచేస్తున్నట్లు భావించాల్సి ఉంటుందని అన్నారు. ప్రధానికి వ్యతిరేకంగా ఎక్కడ నిరసనలు జరిగినా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షమవుతున్నారని ఆయన మండిపడ్డారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థులు 19 రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, వివాదాస్పద పరీక్షల రద్దు, స్వతంత్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ముట్టడికి యత్నించిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్, వాటర్ కేనన్లు, బాష్పవాయువు ప్రయోగించడంతో బీజేపీ రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని బీజేపీ పట్టుబడుతుండగా, చర్చల ద్వారా సమస్యను పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది.

## మీరు కొంచెం మారారు: మోదీతో ఖర్గే సరదా వ్యాఖ్య



మొదటిపేజీ తరువాయి - ఎంపీ రాహుల్ గాంధీల మధ్య చోటుచేసుకున్న ఓ సరదా సంభాషణకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే కుమార్తె రేవతి సూలే వివాహ రిసెప్షన్ ఇటీవల ఢిల్లీలో ఘనంగా జరిగింది. శరద్ పవార్ నివాసంలో నిర్వహించిన ఈ వేడుకకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో కరచాలనం చేయడంతో పాటు, ప్రియాంక గాంధీని "ఎలా ఉన్నారు?" అని ఆత్మీయంగా పలకరించారు. "నేను బాగున్నాను సర్, మీరు ఎలా ఉన్నారు" అని ప్రియాంక గాంధీ అడగడంతో, నేను ఎప్పటిలాగే ఉన్నాను అని ప్రధాని మోదీ అన్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకుంటూ, ప్రధాని మోదీని ఉద్దేశించి "ఆప్ థోడా సా బదల్ గయే హో" (మీరు మునుపటి కంటే కొంచెం మారారు) అని చిరునవ్వుతో వ్యాఖ్యానించారు. దీనికి మోదీ ఆశ్చర్యపోతూ "అవునా?" అని బదులిచ్చి, ఖర్గే భుజంపై చేయి వేసి నవ్వారు. వీరి మధ్య జరిగిన ఈ ఆసక్తికర సంభాషణను చూసి రాహుల్ గాంధీ కూడా నవ్వడం వీడియోలో కనిపిస్తోంది. సుప్రియా సూలే కుమార్తె రేవతి, నాగ్‌పూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త సారంగ్ లఖానీల వివాహం ఈ ఏడాది జూన్‌లో ముంబైలో జరిగింది. తాజాగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఈ రిసెప్షన్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సోనియా గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. రాజకీయంగా తీవ్ర వైరుధ్యాలు ఉన్నప్పటికీ, నేతల మధ్య కనిపించిన ఈ స్నేహపూర్వక వాతావరణం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు

మొదటిపేజీతరువాయి-కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. శాసనసభను దాదాపు రెండేళ్లుగా బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలి వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం నాడు ఆయన పార్టీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన పార్టీ అయిన వైసీపీకి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం ఇష్టపడటం లేదని, అందుకే ప్రజా సమస్యలను మీడియా ద్వారానే ప్రజల దృష్టికి తీసుకెళ్లి నాణేనికి మరోవైపు చూపిస్తానని స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీకి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రజావాణిని బలంగా వినిపించాలని జగన్ సూచించారు. "గత 74 రోజులుగా డీఎస్సీ కుంభకోణంపై 10 రకాల నిరసనలు చేపట్టాం. పేపర్ లీకేజీ, ఔట్‌సోర్సింగ్ కుంభకోణాలు, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు, ప్రభుత్వ ఉత్తర్వుల మార్పు వంటి అంశాలను ఆధారాలతో సహా బయటపెట్టాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశాం" అని జగన్ వివరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలకు సంబంధించి 13 త్రైమాసికాల బకాయిలు పేరుకుపోయాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ అన్నారు. సుమారు రూ. 9,100 కోట్లు, రూ. 3,300 కోట్ల బకాయిలు ఉండగా, ప్రభుత్వం కేవలం రూ. 2,900 కోట్లు విడుదల చేసిందని విమర్శించారు. ఈ అంశాన్ని మండలిలో లేవనెత్తి చర్చకు పట్టుబట్టాలని ఎమ్మెల్సీలకు సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, పంటలకు నీరందడం లేదని, ఉచిత పంటల బీమా నిలిపివేయడంతో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పీపీపీ ప్రాజెక్టుల పేరుతో ప్రైవేటు సంస్థలకు రాయితీలు కల్పిస్తూ ప్రజలపై భారం మోపుతున్నారని, ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణను గట్టిగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. దిశ చట్టం రద్దు, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన బీసీ నేతలు చింతడ రవి, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించడం వంటి అంశాలను సభలో ప్రస్తావించాలని ఆయన ఆదేశించారు. జూనియర్ డాక్టర్ల సమ్మె, ఉద్యోగులు, మహిళలు, యువతలో ఉన్న అసంతృప్తిని కూడా మండలిలో ఎత్తిచూపాలని, పూర్తి ఆధారాలతో సభకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# ఉప్పాడ తీరంలో సముద్రపు కోతకు చెక్



మొదటిపేజీ తరువాయి - ఉప్పాడ తీరానికి రక్షణ కవచం పవన్ సమక్షంలో మద్రాస్ ఐఐటీతో ఒప్పందం సముద్ర కోత సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. తీవ్రమైన కోత కారణంగా దెబ్బతింటున్న ఈ తీరాన్ని పరిరక్షించేందుకు ప్రతిష్ఠాత్మక ఐఐటీ మద్రాస్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ప్రాజెక్టు కింద రూ.323 కోట్ల వ్యయంతో ఉప్పాడ తీరంలో రక్షణ గోడ నిర్మించనున్నారు. కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి (ఎన్డీఎంఎఫ్) ఆమోదంతో చేపట్టనున్న ఈ పనులకు ఐఐటీ మద్రాస్ సాంకేతిక సారథ్యం వహించనుంది. రక్షణ గోడకు అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) రూపకల్పనతో పాటు, నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతలను కూడా ఐఐటీ నిపుణులే చూడనున్నారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్డీఎంఏ) నోడల్ ఏజెన్సీగా, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా వ్యవహరించనున్నాయి. తీర కోత తీవ్రత, సముద్రపు నీటి ప్రవాహాలు, అలల ప్రభావాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసి, ఉప్పాడ తీరానికి అత్యంత అనువైన, పటిష్ఠమైన రక్షణ చర్యలను ఐఐటీ బృందం సూచించనుంది. ఈ ఒప్పందంతో ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రక్రియ పూర్తయినందున, వచ్చే నవంబర్ నుంచి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని ఉప్పాడ తీర ప్రాంత గ్రామాలు, మత్స్యకారుల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఐఐటీ మద్రాస్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఎ.సన్నాసిరాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో, ఏపీ మారిటైమ్ బోర్డ్ చీఫ్ ఇంజనీర్ జి.వి.రాఘవరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేరాల రూపం మారింది.. పోలీసింగ్ మారాలి

మొదటిపేజీ తరువాయి - నేరం జరిగిన వెంటనే తొలి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఆ సమయంలో కీలక ఆధారాలు చేజారిపోకుండా చూడటమే నేర నియంత్రణలో మొదటి విజయమని ఆయన పోలీసు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం నాడు సచివాలయం నుంచి రాష్ట్ర డీజీపీ మొదలుకొని క్షేత్రస్థాయిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వరకు సుమారు 1,650 మంది అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర చరిత్రలో డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ స్థాయి వరకు ఒకేసారి ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పోలీసుల కీర్తి దేశవ్యాప్తంగా మార్మోగాలని, అందుకు తగ్గట్టుగా ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

### పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం

ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నా, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా శాంతిభద్రతలు అత్యంత కీలకమని చంద్రబాబు అన్నారు. "రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసు విభాగం ఒక గర్వకారణం. ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా మీరంతా వ్యవహరించాలి. ఇన్విజిబుల్ పోలీస్, విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలి" అని ఆయన సూచించారు. 2019-24 మధ్య పాలకులు గంజాయి, కల్తీ మద్యాన్ని రాష్ట్రానికి పెను సమస్యగా మార్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తామని, వారి గౌరవం పెరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 14,770 ప్రభుత్వ సీసీ కెమెరాలతో పాటు, ప్రైవేటు వ్యక్తుల కెమెరాలను కలిపి మొత్తం లక్ష కెమెరాలను నేర నియంత్రణ కోసం అనుసంధానించామని తెలిపారు. ఫేస్ రికగ్నిషన్, డీఎన్ఏ డిటెక్షన్ వంటి ఆధునిక టెక్నాలజీతో నేరాలను వేగంగా ఛేదిస్తున్నామని అన్నారు.

### వివేకా కేసులో అది కాస్ట్ లీ మిస్టేక్

రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. "పరామర్శల పేరుతో రోడ్లపై విన్యాసాలు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నంలో మోటార్ సైకిల్ విన్యాసాలు, విశాఖలో మూడు గంటల పాటు రోడ్లు దిగ్బంధించడం వంటివి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాయి. ప్రస్తుతం రోడ్లపై వీరంగం సృష్టిస్తున్న వారిలో 94 శాతం మంది ఒకే పార్టీకి చెందిన వారు. ఏ పార్టీకి కూడా చట్టాన్ని ఉల్లంఘించే లైసెన్స్ లేదు" అని చంద్రబాబు హెచ్చరించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో ఆధారాలను చెరిపేసే ప్రయత్నం జరగడం పోలీసుల వైపు నుంచి జరిగిన అత్యంత ఖరీదైన తప్పిదం (కాస్ట్ లీ మిస్టేక్) అని అన్నారు. నేరం జరిగిన ప్రాంతాన్ని సంరక్షించడంలో వైఫల్యం ఎంతటి నష్టాన్ని కలిగిస్తుందో ఈ ఘటనే నిదర్శనమని, నేరస్తుల పట్ల ఉదాసీనత వద్దని స్పష్టం చేశారు.

### ఇకపై నెలవారీ పెర్ఫార్మెన్స్ రిపోర్ట్

శాంతిభద్రతల విషయంలో ఏపీని దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా నిలపాలన్నదే తన లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. ఇకపై ప్రతీ నెలా పోలీసు శాఖ పనితీరుపై ఒక పెర్ఫార్మెన్స్ రిపోర్టును విడుదల చేయాలని ఆదేశించారు. దీని ద్వారా ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని, సక్సెస్ స్టోరీలను ప్రజలకు వివరించవచ్చని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పూర్తిస్థాయిలో అమలు కావాలని, అదే సమయంలో సంఘ విద్రోహ శక్తులకు పోలీసులంటే భయం కలగాలని సూచించారు. మహిళలపై నేరాల విషయంలో జీరో టాలరెన్స్ విధానం కొనసాగుతుందని, 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి ప్రచారాలతో గంజాయి, మాదకద్రవ్యాలపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు. రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, ప్రమాదాల నివారణకు రోడ్ ఇంజనీరింగ్, హాట్‌స్పాట్‌ల ఆడిట్‌పై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, శాంతి భద్రతల అదనపు డీజీ ఎన్. మధుసూధన రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1200 పోలీస్ స్టేషన్ల నుంచి శాంతిభద్రతలు, ట్రాఫిక్, జీఆర్పీ సహా వివిధ విభాగాల అధికారులు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు.

## మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు

మొదటిపేజీ తరువాయి - వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన విమర్శల దాడిని మరింత ఉద్ధృతం చేశారు. సీఎం సోదరుడికి సంబంధముందని ఆరోపిస్తున్న టెస్సారక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూ కేటాయింపుల విషయంలో రూ. 200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి 'అనుముల హబ్స్' ఏర్పాటులో బిజీగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం ఈ అంశంపై 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ స్పందించారు. "తాము నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ-హబ్ నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం కుటుంబ సభ్యులతో నడిచే, సున్నా ఆవిష్కరణలు, సున్నా ఉద్యోగులతో కూడిన స్కామ్.. అదేనండీ స్కీమ్ అయిన 'అనుముల హబ్స్' సృష్టిస్తున్నారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు, ఎలాంటి ప్రశ్నలు లేకుండా చౌక ధరకే ప్రభుత్వ భూమిని కేటాయిస్తారు. సున్నా పెట్టుబడితో రాత్రికి రాత్రే రూ. 200 కోట్లు సంపాదించినందుకు అనుముల కొండల్ రెడ్డిని 'శతాబ్దపు ఆవిష్కర్త'గా ప్రకటించాలి" అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు. కేవలం రూ. లక్ష చెల్లింపు మూలధనం, సున్నా ఉద్యోగులు ఉన్న కంపెనీకి అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. సుమారు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకే, అంటే గజం రూ. 3,700 చొప్పున కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి కోట్లాది రూపాయలు సంపాదించే ఈ మ్యాజిక్ ట్రిక్‌ను కేవలం అనుముల కుటుంబానికే పరిమితం చేయకుండా తెలంగాణ యువతకు కూడా నేర్పించాలని మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి అన్నారు. టెస్సారక్ట్ సంస్థతో సీఎం సోదరుడికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు చేసిన ప్రకటనను కేటీఆర్ తప్పుబట్టారు. కొండల్ రెడ్డి లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్‌లో ఆయన్ను టెస్సారక్ట్ ఛైర్మన్‌గా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ భూ కేటాయింపులకు సంబంధించిన జీవో, భూమి విలువ, అర్హత ప్రమాణాలు, పెట్టుబడి ప్రతిపాదనలు వంటి అన్ని పత్రాలను ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భూ కేటాయింపుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, దీనిపై ముందుగా గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, అవసరమైతే లోకాయుక్తను, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చి, బాధ్యులను శిక్షించే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు.

## ఇమ్రాన్ ఖాన్ చనిపోయారా? పాక్ జర్నలిస్టు సంచలన వ్యాఖ్యలు.. నిజమెంత?



మొదటిపేజీ తరువాయి - అమెరికాలో ఉంటున్న జర్నలిస్ట్ వజాహత్ సయీద్ ఖాన్ ఓ ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇమ్రాన్ ఖాన్ ఇప్పుడు జీవించి లేరని ముగ్గురు సీనియర్ పాకిస్థాన్ సైనిక అధికారులు తనకు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే వాళ్లు కూడా ఈ సమాచారాన్ని స్వయంగా నిర్ధారించలేదని చెప్పారు. అనధికారిక మార్గాల్లో తమకు సమాచారం అందిందని మాత్రమే వారు చెప్పినట్లు వివరించారు. 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ 2023 నుంచి రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్నారు. ఆయనపై పలు కేసులు కొనసాగుతున్నాయి. జైల్లో ఉన్న ఆయన్ను కలిసేందుకు కుటుంబ సభ్యులకు అనుమతి ఇవ్వడం లేదంటూ పాకిస్థాన్ తెహ్రీక్-ఏ-ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ పలుసార్లు ఆరోపించింది. ఆయనకు సరైన వైద్యం అందడం లేదని కూడా పార్టీ నేతలు చెబుతున్నారు. ఇమ్రాన్ కుటుంబ సభ్యులు, పీటీఐ నేతలు మంగళవారం మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతి ఇవ్వకపోతే సెప్టెంబర్ 27న ఇస్లామాబాద్‌కు లాంగ్ మార్చ్ చేపడతామని పీటీఐ ప్రకటించింది. అంతకుముందే నిరసనలు చేపడతామని హెచ్చరించింది. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై అమెరికా నుంచి కూడా పాకిస్థాన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. 13 మంది అమెరికా చట్టసభ సభ్యులు అక్కడి విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు లేఖ రాశారు. ఇమ్రాన్, ఆయన భార్య బుష్రా బీబీ నిర్బంధ పరిస్థితులపై ఇస్లామాబాద్‌తో మాట్లాడాలని కోరారు.

## 26 ఏళ్ల తర్వాత బట్టబయలైన క్లింటన్ రహస్యం.. అధ్యక్షుల డెకాయ్ విమానాల కథ!

మొదటిపేజీ తరువాయి - భద్రతా కారణాల దృష్ట్యా అసలు విమానానికి బదులుగా ఒక డెకాయ్ (మాయ) విమానాన్ని వాడారని, ఈ విషయాన్ని ప్రభుత్వం జర్నలిస్టులకు ముందుగానే తెలిపిందని ఓ సీనియర్ వైట్ హౌస్ జర్నలిస్ట్ వెల్లడించారు. ఇటీవల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తుర్కియే పర్యటనలో ఇలాంటి వ్యూహాన్నే అనుసరించారన్న వార్తల నేపథ్యంలో ఈ పాత ఘటన ప్రాధాన్యత సంతరించుకుంది. 'ది వాషింగ్టన్ పోస్ట్' కథనం ప్రకారం.. యూఎస్ఏ టుడే వాషింగ్టన్ బ్యూరో చీఫ్ అయిన సూసన్ పేజ్ ఈ విషయాన్ని బయటపెట్టారు. 2000 సంవత్సరంలో ఆమె వైట్ హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఉన్నారు. క్లింటన్ భారత్ నుంచి పాకిస్థాన్‌కు వెళ్లే ముందు, వైట్ హౌస్ అధికారులు తనను ఆఫ్-ది-రికార్డ్ సమావేశానికి పిలిచారని ఆమె తెలిపారు. "పాకిస్థాన్‌కు వెళ్లడంలో ఉన్న ప్రమాదాల కారణంగా తీసుకుంటున్న అసాధారణ భద్రతా చర్యల గురించి వారు నాకు వివరించారు. అందులో డెకాయ్ విమానాన్ని ఉపయోగించడం కూడా ఒకటి. ఆ ముప్పు కేవలం క్లింటన్‌కే కాదు, పర్యటనను కవర్ చేస్తున్న జర్నలిస్టులకు కూడా ఉందని చెప్పారు" అని సూసన్ పేజ్ పేర్కొన్నారు.

క్లింటన్, ట్రంప్ వ్యూహాల్లో తేడా 2000 మార్చిలో ఇస్లామాబాద్‌లో ఎయిర్ ఫోర్స్ వన్ తరహా విమానం ఒకటి ల్యాండ్ అయింది. అందులో నుంచి క్లింటన్‌ను పోలిన ఒక సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ బయటకు వచ్చారు. మీడియా దృష్టి అటువైపు మళ్లిన తర్వాత, గుర్తు తెలియని మరో విమానం ల్యాండ్ కాగా, దాని నుంచి అసలైన అధ్యక్షుడు క్లింటన్ దిగారు. అయితే, ఈ వ్యూహం గురించి జర్నలిస్టుల ప్రతినిధికి ముందుగానే సమాచారం ఇచ్చారు. కానీ, గత నెలలో తుర్కియే నుంచి వెళుతున్నప్పుడు ట్రంప్ విషయంలో భిన్నంగా జరిగింది. ఇరాన్ నుంచి విశ్వసనీయమైన ముప్పు ఉందన్న సమాచారంతో ట్రంప్‌ను రహస్యంగా ఎయిర్‌పోర్ట్ క్యాటరింగ్ ట్రక్కులో ఎక్కించి, గుర్తు తెలియని సి-32ఏ విమానంలోకి మార్చారు. అసలైన అధ్యక్ష విమానం మాత్రం జర్నలిస్టులు, కొందరు సిబ్బందితో డెకాయ్‌గా ప్రయాణించింది. ఈ మార్పు గురించి జర్నలిస్టులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, కిటికీ షేడ్లు మూసివేయమని మాత్రమే ఆదేశించినట్లు 'ది వాషింగ్టన్ పోస్ట్' తెలిపింది. అధికారుల స్పందన ఈ ఘటనపై వైట్ హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చుంగ్ స్పందిస్తూ.. "అధ్యక్షుడి ప్రాణాలకు ముప్పు తలపెట్టే శత్రువులు అమెరికాకు చాలా మంది ఉన్నారు. ఆ ముప్పులను ఎదుర్కోవడానికి మా వద్ద ఉన్న అన్ని మార్గాలను ఉపయోగిస్తాం" అని భద్రతా చర్యలను సమర్థించుకున్నారు. అయితే, డెకాయ్ విమానం గురించి నేరుగా ప్రస్తావించలేదు. దాదాపు రెండున్నర దశాబ్దాలు గడిచిపోవడం, అప్పట్లోనే క్లింటన్ దిగినప్పుడు ఈ వ్యూహం అందరికీ తెలిసిపోవడంతో ఇప్పుడు ఈ విషయాన్ని వెల్లడించడంలో తప్పులేదని భావించినట్లు సూసన్ పేజ్ తెలిపారు. అధ్యక్షుడి కదలికలపై స్వతంత్రంగా నివేదించే వైట్ హౌస్ ప్రెస్ పూల్ విషయంలో క్లింటన్, ట్రంప్ యంత్రాంగాలు అనుసరించిన భిన్నమైన పద్ధతులను ఈ రెండు ఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

# పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై రామప్పలో సినిమా చిత్రీకరణ

### తెలుగు కన్నడ భాషలలో "పినాక" సినిమా చిత్రీకరణ

### అక్టోబర్ 2న విడుదలకు సన్నాహాలు




**వెంకటాపూర్ (రామప్ప), సెప్టెంబర్ 10 (నిజం న్యూస్):** పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్న కన్నడ, తెలుగు భాషలలో "పినాక" మూవీ సినిమా గురువారం పాలంపేట గ్రామంలోని ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయంలో షూటింగ్ చిత్రీకరణ ప్రారంభించారు. దర్శకుడు ధనుంజయ పలు సెట్టింగులు పొందుపరిచి హీరో గణేష్ పై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా దర్శకుడు ధనుంజయ మాట్లాడుతూ ...ఈ చిత్రం కన్నడ మరియు తెలుగు భాషల్లో చేస్తున్నామని, ఈ చిత్రం ఒక సంరక్షణ వంశాన్ని అనుసరిస్తూ రెండు విభిన్న యుగాలలో సాగే పౌరాణిక ఫాంటసీ చిత్రం అని, సినిమా పేరు "పినాక" అని తెలిపారు. ఇందులో నటుడు గణేష్ ఒక పరివర్తనాత్మకమైన ప్రధాన పాత్ర పోషిస్తున్నాడని అన్నారు. హీరో, హీరోయిన్లుగా గణేష్, నయన్ సారిక నటిస్తున్నారని, ఇంకా ఈ సినిమాలో సాధు కోకిల, రాఘయన రఘు, అర్చన అయ్యర్, గిరి, శివన్న, శ్రీనివాసు మూర్తి తదితరులు నటిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 2న విడుదల చేయబోతున్నట్లు దర్శకుడు తెలిపారు. ఈ సినిమా రామప్పలో మూడు రోజులపాటు చిత్రీకరణ జరుగుతుందని పేర్కొన్నారు. ముందుగా శ్రీ రామలింగేశ్వర స్వామి వారినీ దర్శించుకుని దేవాలయం యొక్క విశిష్టతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రామప్ప దేవాలయం కార్యనిర్వాహణాధికారి ఇమ్మడి భాస్కర్, గైడ్ లు విజయ్ కుమార్, వెంకటేష్, టూరిస్ట్ పోలీసులు అరుణ్ కుమార్, శ్రీను, శ్రీకాంత్ పురావస్తు, టూరిజం, దేవదాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు కృషి చేయాలి

### ముల్కనూర్ లో ధీరవనిత చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి – తెలంగాణ సాయుధ పోరాట యోధురాలి పోరాట స్ఫూర్తిని స్మరించిన నాయకులు – రజకుల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఐక్య పోరాటానికి పిలుపు



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 10 (నిజం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని ముల్కనూర్ తెలంగాణ స్థూపం వద్ద తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ధీరవనిత చాకలి ఐలమ్మ ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో మండల రజక సంఘం ప్రధాన కార్యదర్శి ఎదునూరి శ్రీధర్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మండల సురేందర్, ఎం ఆర్ పి ఎస్ హుస్నాబాద్ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి, కొత్తపల్లి గ్రామ సర్పంచ్ శిఖ ప్రదీప్‌లి హాజరయ్యారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు.రజకుల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయంలో శ్రావణమాస రుద్రహోమం, చండీ హోమం

### మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి పొన్నం మంజుల, మాతృమూర్తి పొన్నం మల్లమ్మ, మాలధారణ స్వాములు, తో ఘనంగా అర్చకుల వేద ఆశీర్వచనం




**భీమదేవరపల్లి సెప్టెంబర్ 10 (నిజం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం దేవాదాయ ధర్మదాయ శాఖ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం కొత్తకొండ గ్రామం, భీమదేవరపల్లి మండలం, నందు గురువారం రోజు శ్రావణమాసం పురస్కరించుకొని రుద్ర హోమం మరియు చండీ హోమం నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమంలో మాన్యులు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సతీమణి పొన్నం మంజుల గౌడ్ మరియు మాతృమూర్తి పొన్నం మల్లమ్మ , భక్తులు, గ్రామ ప్రజలు, మాలధారణ వేసుకున్న స్వాములు పాల్గొన్నారు. అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందించారు అని వీరభద్ర స్వామి ఆలయ కార్య నిర్వహణ అధికారి పి కిషన్ రావు తెలిపారు.

# గణేష్ మండప నిర్వాహకులకు దామెర ఎస్ఐ సూచనలు




**దామెరా మండలం సెప్టెంబర్ 10 (నిజం న్యూస్):** దామెర మండలంలోని వివిధ గ్రామాల్లో గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులకు దామెర ఎస్ఐ జు. వీరభద్రరావు పలు సూచనలు చేశారు. గణేష్ మండపాల ఏర్పాటుకు ముందుగా పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని, మండపాల వద్ద విద్యుత్ వైర్లు, లైటింగ్ ఏర్పాటు విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విగ్రహ నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలను పాటించాలని, డీజేలు మరియు లౌడ్‌స్పీకర్ల వినియోగంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు మండప నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని దామెర ఎస్ఐ జు. వీరభద్రరావు కోరారు.

# గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న ప్రైవేట్ డెయిరీని తొలగించాలి

### బీజేపీ సిద్ధిపేట జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృధ్వీరాజ్ గౌడ్ డిమాండ్



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 10 (నిజం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని గట్ల నర్సింగాపూర్ గ్రామపంచాయతీ అవసరాల కోసం కొనుగోలు చేసిన ఆరు గుంటల స్థలాన్ని పంచాయతీకే పూర్తి హక్కులతో అప్పగించాలని బీజేపీ సిద్ధిపేట జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృధ్వీరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు.హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లోని వివాదాస్పద స్థలంపై అధికారులు రికార్డులను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.పంచాయతీ కార్యాలయ అవసరాల కోసం 1992లో గుంటకు రూ.1,000 చొప్పున రూ.6,000కు ఆరు గుంటల భూమిని వ్రాతపూర్వకంగా కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యాలయం ఎదుట ఉన్న ప్రైవేట్ డెయిరీ భవనం, స్థల హక్కులు, వినియోగంపై కూడా సమగ్ర విచారణ జరపాలని కోరారు.పంచాయతీ స్థలం గ్రామసభలు, ప్రజా సమావేశాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడేలా చూడాలని పృధ్వీరాజ్ గౌడ్ పేర్కొన్నారు.

# మేరా రేషం - మేరా అభిమాన్ 2.0 లో భాగంగా ముల్కనూర్ సహకార సంఘంతో పట్టుపరిశ్రమ శాఖ సంయుక్త కార్యక్రమం

### ఎల్ నినోలోనూ లాభదాయక పట్టు పరిశ్రమ – మల్బరీ శాస్త్రీయ సాగు, పట్టుపురుగుల పెంపకంపై 100 మంది రైతులకు అవగాహన – కేంద్ర, రాష్ట్ర శాస్త్రవేత్తల శిక్షణ




**భీమదేవరపల్లి సెప్టెంబర్ 10 (నిజం న్యూస్):** హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మేరా రేషం -- మేరా అభిమాన్ 2.0 (ఎం ఆర్ ఎం ఏ 2.0) కార్యక్రమంలో భాగంగా కేంద్ర పట్టు మండలి మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పట్టుపరిశ్రమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలోలి శాస్త్రీయ, లాభదాయక పట్టుపరిశ్రమపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ కోఆపరేటివ్ అండ్ మార్కెటింగ్ సొసైటీలో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని సి ఎస్ బి ఎస్ ఆర్ టి ఐ , మైసూరు శాస్త్రవేత్త డా. వజ్రమ్మ, హనుమకొండ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ అనసూయ సమన్వయంతో నిర్వహించారు. ఆర్ ఎస్ ఆర్ ఎస్ ములుగు శాస్త్రవేత్త డా. తిరుపం రెడ్డి, హనుమకొండ ఇనూా కమలాకర్ రెడ్డి, ఆయిల్‌ఫెడ్ ప్రతినిధి శంకర్, భీమదేవరపల్లి వ్యవసాయ అధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు. ఎం ఆర్ ఎం జిల్లా నోడల్ అధికారి సంజీవ రెడ్డి, వరంగల్ అసిస్టెంట్ డైరెక్టర్ తిరుపతి రెడ్డి, వరంగల్--హనుమకొండ సెరికల్చర్ అధికారి శ్రీ మల్లయ్య కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల రైతులు, పట్టుపరిశ్రమను చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్న రైతులు, మహిళలు, యువతతో కలిపి సుమారు 100 మంది రైతులు చురుకుగా పాల్గొన్నారు. ఈ ఎల్ నినో వర్షాభావ పరిస్థితుల్లో మల్బరీని శాస్త్రీయంగా సాగు చేయడం, పట్టుపురుగుల పెంపకం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఉత్పాదకత పెంపు, విలువ ఆధారిత ఉత్పత్తులు తదితర అంశాలపై రైతులతో నిపుణులు చర్చించారు. అలాగే మల్బరీని పశువులకు మేతగా ఉపయోగించడం వంటి అంశాలపై వివరించారు. చాలా మంది ప్రగతిశీల పట్టు రైతులు మిగతా రైతులతో వారి యొక్క అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పట్టుపరిశ్రమను లాభదాయకమైన ఉపాధి అవకాశంగా మార్చడంతో పాటు మహిళలు, యువతను కూడా ఈ రంగంలోకి తీసుకురావడానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్య విలువలను పాటించాలి ప్రతిపక్షంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

### బి ఆర్ ఎస్ వైఖరిపై కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పచునూరి కరుణాకర్ విమర్శలు



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 10 (నిజం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం రోజు మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ బి ఆర్ ఎస్ నాయకులు బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను పోషించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పచ్చునూరి కరుణాకర్ సూచించారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు, రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఉన్న ప్రజాస్వామ్య వేదిక అని, దానిని రాజకీయ ఘర్షణలకు వేదికగా మార్చడం సమంజసం కాదు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలపై ప్రతిపక్షాలకు భిన్నాభిప్రాయాలు ఉంటే వాటిని సభలో నిర్మాణాత్మకంగా ప్రస్తావించి, ప్రజలకు ఉపయోగపడే సూచనలు ఇవ్వాలని కోరారు. గత పాలనను ఒకసారి బి ఆర్ ఎస్ నాయకులు గుర్తు చేసుకోవాలి ప్రజాస్వామ్యం, నిరసనల హక్కుల గురించి బిఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతున్న నేపథ్యంలో గత ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న పరిణామాలను కూడా గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందని పచ్చునూరి కరుణాకర్ అన్నారు. ధర్నా చౌక్ విషయంలో గతంలో తీసుకున్న నిర్ణయాలను ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకున్నారని అన్నారు. ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికులు, రైతులు తమ సమస్యలపై ఉద్యమించిన సందర్భాల్లో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. నెరెళ్ల, గౌరవెల్లి, రంగనాయక సాగర్ వంటి ప్రాంతాల్లో ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులు ఎదుర్కొన్న సమస్యలు, వారి ఆవేదనలను ప్రభుత్వం--ప్రతిపక్షాలు కలిసి పరిష్కరించే దిశగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ హుందాతనాన్ని కాపాడాలి శాసనసభ అనేది ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించే పవిత్రమైన ప్రజాస్వామ్య వేదిక అని పచునూరి కరుణాకర్ పేర్కొన్నారు. ప్రభుత్వం చేసే ప్రతి పనిని వ్యతిరేకించడమే ప్రతిపక్ష ధర్మం కాదు, ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలకు సహకరిస్తూనే ప్రభుత్వం తప్పు చేసినప్పుడు ప్రశ్నించడం, ప్రత్యామ్నాయ సూచనలు ఇవ్వడం బాధ్యతాయుతమైన ప్రతిపక్ష లక్షణం అని అన్నారు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షం--ప్రతిపక్షం రెండూ ప్రజల కోసమే పనిచేయాలి. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుంది అని పచునూరి కరుణాకర్ పేర్కొన్నారు.

# భూమి కోసం భూస్వామ్యాన్ని ఎదిరించిన వీరవనిత.. ఐలమ్మకు నల్లబెల్లిలో ఘన గౌరవం

### నల్లబెల్లి మండల కేంద్రంలో ఘనంగా చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

### పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలన్న వక్తలు



**సెప్టెంబర్ 10 (నిజం న్యూస్):** భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరి విముక్తి కోసం భూస్వామ్య పెత్తందారులను ఎదిరించి తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో చెరగని ముద్ర వేసిన వీరవనిత చాకలి ఐలమ్మకు నల్లబెల్లి మండల కేంద్రంలో ఘన గౌరవం దక్కింది. ఆమె పోరాట స్ఫూర్తికి ప్రతీకగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గురువారం ప్రజా సంఘాలు, రజక సంఘం నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, గ్రామస్థుల సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు. నల్లబెల్లి గ్రామ రజక సంఘం అధ్యక్షుడు రాపాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సదాశివ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సీహెచ్ దళపతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు నూతనకంటి ఆనందం, డాక్టర్ పానుగోటి గోపాల్, డాక్టర్ అలుగునూరి విజయకుమార్, శ్రీమతి పొదిల్లా వసంత శోభన్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ముప్పు కృష్ణ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు నేటి తరానికి ఆదర్శమన్నారు. భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన పోరాట పటిమను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. డాక్టర్ సీహెచ్ దళపతి మాట్లాడుతూ ఐలమ్మ ఒక వర్గానికో, ఒక ప్రాంతానికో పరిమితమైన నాయకురాలు కాదని, అన్యాయాన్ని ప్రశ్నించే ప్రతి ఒక్కరికీ ఆమె స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఆమె పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేసేందుకు విగ్రహ ఏర్పాటు దోహదపడుతుందన్నారు. కీర్తిశేషులు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి జ్ఞాపకార్థం, ఆయన అన్న కుమారులు పెద్ది మహిపాల్ రెడ్డి, పెద్ది గణేష్ రెడ్డి విగ్రహ దాతలుగా కార్యక్రమంలో పాల్గొన్నారు. నాగేల్లి జ్యోతి ప్రకాష్, ఉపసర్పంచ్ గుమ్మడి వేణు, కొల్లూరి లక్ష్మీనారాయణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చింతకింది కుమారస్వామి, తెలంగాణ ఉద్యమకారుడు బట్టు సాంబయ్య, సీపీఎం మండల కార్యదర్శి బొడిగె సమ్మయ్య, కడియాల మనోహర్, మామిడాల నరసయ్య, పొదిల రామచందర్, రమేష్‌తో పాటు రజక సంఘం నాయకులు ఆవునూరి కిషోర్, పొదిళ్ల శోభన్, బసవరాజు, భాస్కర్, పున్నం రాజ్‌కుమార్, ఫైనల్ జంపయ్య, జక్కయ్య, సారమల్లు, వైనాల మధు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకంగా నిలవాలని వక్తలు ఆకాంక్షించారు.

# నేరాలపై 'నిఘా కన్ను' ముత్తారంలో 8 సీసీ కెమెరాలు

### ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానం ఎస్సై రాజు

### గ్రామపంచాయతీ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిఘా వ్యవస్థ ప్రారంభం





**భీమదేవరపల్లి సెప్టెంబర్ 10 (నిజం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం గ్రామంలో ఎక్కడ ఏం జరిగినా ఇక నిఘా కెమెరాల కంటికి చిక్కాల్సిందే. చోరీలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ముత్తారం గ్రామం మరో అడుగు ముందుకేసింది.గ్రామపంచాయతీ, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో 8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. గురువారం ముల్కనూర్ ఎస్సై రాజు, సర్పంచ్ భారతి జైపాల్ రెడ్డితో కలిసి కెమెరాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ.సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను ముందుగానే నియంత్రించడంతో పాటు, నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించేందుకు కీలక ఆధారాలు లభిస్తాయని తెలిపారు. గ్రామాల్లో తరచూ చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని పేర్కొన్న ఎస్సై రాజు ముత్తారం గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని మండలంలోని ఇతర గ్రామాలు కూడా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గ్రామ భద్రత కోసం ముందుకొచ్చిన గ్రామపంచాయతీ పాలకవర్గం, ముదిరాజ్ సంఘం సభ్యులను అభినందించారు.అనంతరం పంచాయతీ పాలకవర్గం, ముదిరాజ్ సంఘం సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాట్ల హరికుమార్, ముదిరాజ్ సంఘం సభ్యులు కూన పెద్ద కనకయ్య, కూన చిన్న కనకయ్య, కూన రాజా సమ్మయ్య, కూన శంకర్, కూన భిక్షపతి, కూన రమేష్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# అదనపు పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలనీ ఆర్డీవో కి వినతి పత్రం

**చెన్నారావుపేట సెప్టెంబర్ 10 (నిజం న్యూస్):** చెన్నారావుపేట మండలంలోని బోడ మాణిక్యం తండా గ్రామపంచాయతీ కి ప్రత్యేక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని రెవిన్యూ డివిజనల్ అధికారినీనీ కలసి వినతి పత్రం సమర్పించిన మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మహబూబ్ సింగ్ రాథోడ్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి భూక్య మోహన్ నాయక్ మరియు మంచోజు వెంకటేశ్వర్లు ఇదే విధంగా చెన్నరావుపేట మండల పరిధిలో కొత్తగా ఏర్పాటు అయిన అన్ని తండా గ్రామపంచాయతీలకు ప్రత్యేక ఓటర్ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరడం జరిగినది. గత 25, 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేయబడిన పోలింగ్ స్టేషన్లో తండావాసులకు దూరం ప్రయాణం చేసి పోలింగ్ కు వెళ్లడం వలన ప్రయాణం సమయంభారమవుతున్నందున ఇట్టి విషయాన్ని పరిశీలించి ఆర్డీవో సానుకూలంగా స్పందించి వచ్చే ఎన్నికల వరకు అదనపు పోలింగ్ స్టేషన్ లు అయ్యే విధంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు..

# ఈ డ్రింక్స్ తాగితే లివర్ కు మస్తు రిలీఫ్ వస్తుంది..! సూపర్ గా పని చేస్తుంది..!



లివర్ శరీరంలో హానికర పదార్థాలను బయటకు పంపే ప్రధాన అవయవం. అయితే అది బాగా పనిచేయాలంటే కొన్ని సహజమైన డ్రింక్ లను రోజూ తీసుకోవడం అవసరం. ఇవి కాలేయాన్ని శుభ్రపరిచి ఆరోగ్యంగా ఉంచే విధంగా సహాయపడతాయి. ఇప్పుడు అలాంటి ఉత్తమమైన డ్రింక్ ల గురించి తెలుసుకుందాం. మన శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో లివర్ ఒకటి. ఇది శరీరంలో ఉన్న హానికరమైన విష పదార్థాలను బయటకు పంపించే క్రమంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తుంది. అయితే జీవనశైలి, ఆహారం, కాలుష్యం వల్ల లివర్ సరిగా పనిచేయకపోతే ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. అలాంటప్పుడు ఈ సహజ డ్రింక్ లను కొన్ని రోజులు ఉపయోగించి కాలేయాన్ని శుభ్రపరచుకోవచ్చు.ప్రతి ఉదయం లేవగానే ఖాళీ కడుపుతో ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో సగం నిమ్మకాయ రసం కలిపి తాగండి. ఇది కాలేయాన్ని శుభ్రపరిచే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. కేవలం మూడు రోజుల్లోనే మీరు తేలికపాటు అనుభూతి పొందుతారు. రోజూ తాజా బీట్రూట్ రసం తాగటం వల్ల లివర్ ఆరోగ్యంగా మారుతుంది. ఇందులో ఉన్న బెటలైన్స్ అనే రసాయనాలు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తూ కాలేయ కణాలను నయం చేస్తాయి. కొత్త కణాల ఏర్పాటుకు తోడ్పడతాయి. గోరువెచ్చని నీటిలో అర టీ స్పూన్ అల్లం రసం, ఒక స్పూన్ తేనె కలిపి తాగితే.. ఇది శరీరంలోని జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తుంది. అలాగే కాలేయంపై ఉన్న ఒత్తిడిని తగ్గించి దాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. రోజుకి రెండు నుంచి మూడు కప్పుల గ్రీన్ టీ తాగడం ద్వారా లివర్ లో ఉన్న కొవ్వును తగ్గించవచ్చు. దీనిలోని కాటెచిన్స్ అనే యాంటీఆక్సిడెంట్లు కాలేయ పనితీరును మెరుగుపరుస్తాయి. గోరువెచ్చని పాలలో అర టీ స్పూన్ పసుపు పొడి, చిటికెడు నల్ల మిరియాల పొడి కలిపి తాగండి. పసుపులో ఉండే కర్కుమిన్ అనే పదార్థం కాలేయాన్ని శుభ్రపరచడంలో అద్భుతంగా సహాయపడుతుంది. ఒక గ్లాసు నీటిలో 1 లేదా 2 టేబుల్ స్పూన్లు యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి ఉదయం తాగడం వల్ల బైల్ ఉత్పత్తి పెరిగి లివర్ డిటాక్స్ ప్రక్రియ వేగవంతం అవుతుంది. క్యారెట్, బీట్రూట్, ఆకుకూరల మిశ్రమంతో చేసిన వెజిటబుల్ జ్యూస్ నిత్యం తాగడం వల్ల కాలేయానికి అవసరమైన పోషకాలు అందుతాయి. ఇవి శరీరానికి డిటాక్స్ చేయడంలో సహాయపడతాయి. డాండెలియన్ రూట్.. ఈ చెట్టు వేరు నుంచి తయారయ్యే టీ బైల్ స్రవణాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది కాలేయంలోని విషపదార్థాలను తొలగించడంలో కీలకంగా పని చేస్తుంది. రోజుకి 2-3 కప్పులు తాగవచ్చు. క్రాన్బెర్రీలలో పుష్కలంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు కాలేయాన్ని రిపేర్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఒక గ్లాసులో 75 శాతం నీరు, 25 శాతం క్రాన్బెర్రీ రసం కలిపి తాగడం ఉత్తమం. మిల్క్ థిస్టిల్ అనే మూలిక టీ రూపంలో తీసుకుంటే కాలేయ కణాలను రక్షించడమే కాకుండా.. అవి తిరిగి పునరుత్పత్తి కావడాన్ని ప్రోత్సహిస్తుంది. రోజుకు ఒకటి లేదా రెండు కప్పులు తాగవచ్చు.ఈ డ్రింక్ లు కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. అయితే ఏవైనా తీవ్రమైన లివర్ సమస్యలు ఉంటే తప్పకుండా వైద్యుడి సలహా తీసుకోవాలి.

# కేవలం 20 నిమిషాలు.. దమ్ము కొట్టకుంటే మీ ఒంట్లో ఏం జరుగుతుందో తెలుసా?



నేటి యువతకు ధూమపానం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అయితే పొగాకు మానేయడం వల్ల మన ఆరోగ్యం ఎలా మెరుగుపడుతుందో తాజా పరిశోధనల్లో తేలింది. 20 నిమిషాలు పొగాకు మానేయడం వల్ల 20 సంవత్సరాల ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మరణాలు..ఆరోగ్యాన్ని గుల్ల చేసే కారకాల్లో పొగాకు ముందు వరుసలో ఉంటుంది. దీని వినియోగం మొత్తం ఆరోగ్యానికి హానికరం అని మనందరికీ తెలిసినప్పటికీ.. జీవనశైలిలో వీటి వినియోగాన్ని దూరం చేయడం చాలా మందికి కష్టంగా ఉంటుంది. ముఖ్యంగా యువతకు ధూమపానం ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అయితే పొగాకు మానేయడం వల్ల మన ఆరోగ్యం ఎలా మెరుగుపడుతుందో తాజా పరిశోధనల్లో తేలింది. 20 నిమిషాలు పొగాకు మానేయడం వల్ల 20 సంవత్సరాల ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మరణాలు పొగాకు వాడకం వల్లే సంభవిస్తున్నాయి. నిజానికి, ధూమపానం మానేయాలని నిర్ణయించుకున్న క్షణమే శరీరం నిమిషాల్లోనే నయం కావడం ప్రారంభిస్తుంది. మళ్లీ జీవితంలో పొగాకు ముట్టుకోకుండే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. 20 నిమిషాలు, 12 గంటలు, 9 నెలలు, 10 సంవత్సరాలు, 20 సంవత్సరాల తర్వాత.. ఇలా ఏ స్థాయిలో ధూమపానం మానేయడం వల్ల మన ఆరోగ్యం ఎలా మెరుగుపడుతుందో కూడా నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలో కలిగించే మార్పులు భవిష్యత్తులో ధూమపానం మానేయడానికి మనల్ని ప్రోత్సహిస్తాయి. ధూమపానం మానేసిన 20 నిమిషాల్లోనే, హృదయ స్పందన రేటు, రక్తపోటు ఆరోగ్యకరమైన స్థాయికి చేరుకోవడం ప్రారంభమవుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడటం ప్రారంభమవుతుంది. సిగరెట్ పొగలో కనిపించే కార్బన్ మోనాక్సైడ్ అనే హానికరమైన వాయువు, ధూమపానం మానేసిన 12 గంటల తర్వాత రక్తప్రవాహంలోకి వెళ్లడం ప్రారంభిస్తుంది. శరీరంలో ఆక్సిజన్ స్థాయి సాధారణ స్థితికి వస్తుంది. గుండె, ఊపిరితిత్తులపై భారాన్ని తగ్గిస్తుంది. అదే ధూమపానం మానేస్తే.. 24 గంటల తర్వాత గుండెపోటు ప్రమాదం తగ్గడం ప్రారంభమవుతుంది. పొగాకు ద్వారా ప్రవేశించే విష పదార్థాలను శరీరం స్వయంగా శుభ్రపరుస్తుంది. ధూమపానం మానేసిన 48 గంటల తర్వాత నరాల చివరలు పునరుత్పత్తి చెందడం ప్రారంభిస్తాయి. దీని వలన రుచి, వాసన తెలిపే ఇంద్రియాలు మెరుగుపడతాయి. ఈ సమయానికి నికోటిన్ అంతా శరీరం నుంచి బయటకు వెళ్లిపోతుంది. ధూమపానం మానేసిన 1 నుంచి 3 నెలల తర్వాత ఊపిరితిత్తుల పనితీరు గణనీయంగా మెరుగుపడటం ప్రారంభమవుతుంది. శ్వాస తీసుకోవడం సులభం అవుతుంది. శారీరక శక్తి పెరుగుతుంది. రక్త ప్రసరణ స్థిరీకరించబడుతుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. ఊపిరితిత్తులలో సిలియా అని పిలువబడే చిన్న వెంట్రుకల లాంటి నిర్మాణాలు ఉంటాయి. ఇవి ధూమపానం మానేసిన 9 నెలల తర్వాత తిరిగి పెరగడం, సరిగ్గా పనిచేయడం ప్రారంభిస్తాయి. ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడతాయి. తద్వారా దగ్గు, శ్వాసకోశ వ్యాధులను తగ్గిస్తుంది. ధూమపానం మానేసిన ఏడాది తర్వాత, ధూమపానం చేసేవారితో పోలిస్తే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం సగానికి తగ్గుతుంది. గుండె, రక్త నాళాలు, ఊపిరితిత్తులు తమను తాము మరమ్మతు చేసుకుంటూనే ఉంటాయి. 5 ఏళ్ల తర్వాత పక్షవాతం వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. నోరు, గొంతు, అన్నవాహిక, మూత్రాశయం క్యాన్సర్ల ప్రమాదాలు కూడా బాగా తగ్గుతాయి. ధూమపానం మానేసిన పదేళ్ల తర్వాత ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో చనిపోయే ప్రమాదం సగానికి సగం తగ్గుతుంది. స్వరపేటిక, క్లోమ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయి. ధూమపానం మానేసిన 15 నుంచి 20 సంవత్సరాల తర్వాత కరోనరీ హార్ట్ డిసీజ్ ప్రమాదం సాధారణ స్థితికి చేరుతుంది. స్ట్రోక్, అనేక రకాల క్యాన్సర్ల దీర్ఘకాలిక ప్రమాదాలు తగ్గుముఖం పడతాయి.

# ఆరోగ్యానికి ఏది మంచిది..? నిపుణులు ఏం చెబుతున్నారు..?



ఆహార పదార్థాలకు తీపి రుచి రావాలంటే చాలా మంది బెల్లం లేదా పంచదారను వాడుతుంటారు. అయితే ఆరోగ్యపరంగా ఈ రెండింటిలో ఏది మంచిదో తెలుసుకోవడం అవసరం. ఎందుకంటే ప్రస్తుత కాలంలో మనం తినే తీపి పదార్థాల ప్రభావం మన ఆరోగ్యంపై తీవ్రంగా పడుతోంది. బెల్లాన్ని తక్కువ స్థాయిలో మాత్రమే ప్రాసెస్ చేస్తారు. అది సహజ స్వరూపంలోనే ఎక్కువగా ఉంటుంది. ఇక పంచదార విషయానికి వస్తే.. అది పూర్తిగా రిఫైన్ చేయబడిన పదార్థం. దీని తయారీలో ఉండే సహజ పోషకాలు పూర్తిగా పోతాయి. అందువల్ల ఇది శరీరానికి ఏ ప్రయోజనమూ ఇవ్వదు.. కేవలం తీపి మాత్రమే అందిస్తుంది. బెల్లంలో మన ఆరోగ్యానికి అవసరమైన ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు లభిస్తాయి. ఇవి శరీరంలో రక్తహీనతను తగ్గించడంలో, ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. మరోవైపు పంచదారలో మాత్రం గ్లూకోజ్ తప్ప వేరే పోషకాలు ఉండవు. బెల్లం సహజమైన లాక్సేటివ్ లా పని చేస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో తోడ్పడుతుంది. మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా పాత బెల్లం శరీరానికి ఇంకా మెరుగైన ఫలితాలను అందించగలదు. బెల్లంలో ఉండే ఐరన్, మన శరీరంలోని హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. రక్తహీనతతో బాధపడే వారికి ఇది మంచి సహాయకారి. బెల్లం తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న ఆహార పదార్థం. అంటే దీన్ని తీసుకున్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగవు. ఇది మధుమేహ వ్యాధి ఉన్నవారికి మంచిది. ఇక పంచదార విషయానికి వస్తే.. దాని గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువగా ఉంటుంది. తినగానే రక్తంలో షుగర్ స్థాయిలు ఒక్కసారిగా పెరిగిపోతాయి. ఇది ఆరోగ్యానికి ముప్పుగా మారుతుంది ప్రస్తుత కాలంలో మనం తినే రిఫైన్డ్ పంచదారతో తయారైన పదార్థాల వాడకం పెరగడం వల్లే షుగర్, బరువు పెరగడం, గుండె సమస్యలు వంటి వ్యాధులు పెరుగుతున్నాయి. దీని వల్ల ఆరోగ్యంపై చెడు ప్రభావాలు ఎక్కువవుతున్నాయి. తీపి రుచి కోసం పంచదారకు బదులుగా బెల్లాన్ని వాడటం ఆరోగ్యానికి చాలా మేలైన ఎంపిక. బెల్లం సహజంగా తయారవుతూ.. శరీరానికి అవసరమైన పోషకాలు అందిస్తుంది. కాబట్టి రోజువారీ ఆహారంలో బెల్లాన్ని సరైన విధంగా వినియోగిస్తే ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడంలో సహాయపడుతుంది.

# సన్నబడాలని ఉందా? ఈ సంప్రదాయ పిండితో బరువు తగ్గడం ఎంత ఈజీనో



శరీర బరువు అదుపులో ఉంచుకోవాలని ఆశించేవారికి శుభవార్త! మన సంప్రదాయ భారతీయ ఆహారంలో ఒక అద్భుతమైన పోషకాహారం ఉంది. అదే సత్తు. కేవలం రుచిలో గొప్పదైన ఈ ఆహారం, బరువు తగ్గడానికి కూడా అద్భుతంగా పనిచేస్తుంది. ప్రొటీన్లు, పీచు పదార్థాలు పుష్కలంగా ఉండే సత్తు, మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతూనే బరువును నియంత్రించడంలో ఎలా సాయపడుతుందో ఇప్పుడు చూద్దాం. సత్తు, శనగలు లేదా ఇతర పప్పులను ఎండబెట్టి, వేయించి, మెత్తగా చేసిన పిండి. ఇది ప్రొటీన్, ఫైబర్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలతో నిండిన సంప్రదాయ భారతీయ సూపర్‌ఫుడ్. బరువు తగ్గాలనుకునేవారికి సత్తు గొప్ప ఎంపిక. ఇది త్వరగా కడుపు నింపుతుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. దీనితో అనవసరమైన చిరుతిళ్లు తగ్గించుకోవచ్చు, బరువు తగ్గించే ఆహారంలో ఇది ఉత్తమమైనది.

**అధిక ప్రొటీన్:**

సత్తులో ఉండే ప్రొటీన్ కండరాల నిర్మాణానికి సాయపడుతుంది, ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతుంది. దీంతో అనవసరంగా తినడం తగ్గుతుంది, బరువు తగ్గడానికి ఇది కీలకం.

**ఫైబర్ పుష్కలం:**

సత్తులో గల ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, కడుపు ఉబ్బరం, మలబద్ధకం నివారిస్తుంది. ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ పోషకాలను సరిగా గ్రహిస్తుంది, జీవక్రియ మందగించడం వల్ల వచ్చే బరువు పెరుగుదలను అడ్డుకుంటుంది.

**జీవక్రియను పెంచుతుంది:**

ఐరన్, మెగ్నీషియం, కాల్షియం లాంటి ముఖ్యమైన పోషకాలు సత్తులో ఉంటాయి. ఇవి జీవక్రియ ప్రక్రియలకు మద్దతు ఇస్తాయి. జీవక్రియ పెరిగితే క్యాలరీలు సమర్థంగా ఖర్చవుతాయి, వేగంగా బరువు తగ్గవచ్చు.

**రక్తంలో చక్కెర నియంత్రణ:**

సత్తుకు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంది. అంటే ఇది శక్తిని నెమ్మదిగా విడుదల చేస్తుంది, రక్తంలో చక్కెర అకస్మాత్తుగా పెరగడాన్ని, తగ్గడాన్ని నివారిస్తుంది. స్థిరమైన రక్తంలో చక్కెర ఆకలి బాధలను నియంత్రిస్తుంది, ఎక్కువగా తినే ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**శరీర శుద్ధికి సాయం:**

సత్తు సహజమైన డిటాక్సిఫైయర్‌గా పనిచేస్తుంది, శరీరం నుండి విష పదార్థాలను బయటకు పంపుతుంది. శుభ్రమైన వ్యవస్థ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, జీవక్రియను పెంచుతుంది, వ్యర్థాలను సమర్థంగా తొలగించడం ద్వారా బరువు తగ్గడానికి సాయపడుతుంది.

**తక్కువ క్యాలరీలతో శక్తి:**

అధిక క్యాలరీల ప్రాసెస్ చేసిన ఆహారాలకు భిన్నంగా, సత్తు సహజమైన శక్తి బూస్టర్. ఇది అనవసరమైన కొవ్వులు, చక్కెరలు లేకుండా నిరంతర శక్తిని అందిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి వ్యాయామానికి ముందు లేదా తర్వాత ఇది అద్భుతమైన పానీయం.

**బరువు తగ్గడానికి సత్తును ఐదు మార్గాల్లో తినవచ్చు:**

**సత్తు పానీయం:**

రెండు చెంచాల సత్తును ఒక గ్లాసు నీరు, చిటికెడు ఉప్పు, నిమ్మరసం కలుపాలి. ఈ పానీయం తక్కువ క్యాలరీలతో, ప్రొటీన్‌తో నిండి ఉంటుంది, గంటల తరబడి కడుపు నిండుగా ఉంచుతుంది. ఉదయం దీనిని తాగడం వల్ల జీవక్రియ నియంత్రణలో ఉంటుంది, రోజు మొత్తం ఆకలి తగ్గుతుంది.

**సత్తు మజ్జిగ:**

సత్తును మజ్జిగ, జీలకర్ర పొడి, నల్ల ఉప్పుతో కలిపి తాగాలి. ఇది ప్రొటీన్ నిండిన, జీర్ణక్రియకు అనుకూలమైన పానీయం. మజ్జిగ జీర్ణక్రియకు, గట్ ఆరోగ్యానికి సాయపడుతుంది, సత్తు ప్రొటీన్, ఫైబర్ అందిస్తుంది. సత్తు రోటీ లేదా పరాటా: సత్తును గోధుమ పిండితో కలిపి పోషకమైన రోటీ లేదా పరాటా చేయాలి. ఈ కలయిక నిరంతర శక్తిని అందిస్తుంది, ఆకలి బాధలను తగ్గిస్తుంది, ఎక్కువగా తినకుండా చేస్తుంది.

**సత్తు లడ్డూ:**

**సత్తును బెల్లం, కొద్దిగా నెయ్యి కలిపి లడ్డూలు చేయాలి. ఈ ఆరోగ్యకరమైన శక్తి లడ్డూలు తీపి కోరికలను తీరుస్తాయి, బరువు పెరగకుండా చూస్తాయి. చక్కెర చిరుతిళ్లకు ఇది మంచి ప్రత్యామ్నాయం.**

**సత్తు చిల్లా:**

సత్తు, తరిగిన కూరగాయలు, మసాలా దినుసులతో పిండి కలిపి పాన్‌కేక్‌లా కాల్చాలి. ఈ ప్రొటీన్ అధికంగా ఉండే వంటకం తేలికైనది, కడుపు నింపేది. ఇది ముఖ్యమైన పోషకాలను అందిస్తూ క్యాలరీల తీసుకోవడాన్ని నియంత్రిస్తుంది. ఈ వివిధ రూపాల్లో సత్తును రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా బరువు తగ్గించవచ్చు, అదే సమయంలో సరైన పోషణను, శక్తిని పొందవచ్చు.

# వంట రుచిని పెంచే ఆరోగ్య నిధి చింతపండు ప్రయోజనాలు తెలిస్తే అస్సలు విడిచిపెట్టరు











చింతపండును రోజువారీ వంటలలో ఉపయోగిస్తే దాని నుండి మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు అంటున్నారు పోషకాహార నిపుణులు. చింతపండులో విటమిన్ సి, విటమిన్ బి, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. చింతపండును రోజూ తినడం ద్వారా, అనేక ప్రాణాంతక వ్యాధుల నుండి మనల్ని మనం రక్షించుకోవచ్చు అంటున్నారు నిపుణులు. అదేలాగో ఇక్కడ తెలుసుకుందాం.. ఫైబర్ అధికంగా ఉండే చింతపండు తీసుకోవడం వల్ల శరీర జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. చింతపండు మంచి ప్రేగు కదలికను ప్రోత్సహిస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. అధిక బరువు ఉన్నవాళ్లు చింతపండును తీసుకోవడం వల్ల బరువు కంట్రోల్లో ఉంటుంది. ఊబకాయం సమస్యతో బాధపడేవారు చింతపండు తీసుకుంటే మంచిది. ఫైబర్ అధికంగా ఉండే చింతపండు తీసుకోవడం వల్ల శరీర జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. చింతపండు మంచి ప్రేగు కదలికను ప్రోత్సహిస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. అధిక బరువు ఉన్నవాళ్లు చింతపండును తీసుకోవడం వల్ల బరువు కంట్రోల్లో ఉంటుంది. ఊబకాయం సమస్యతో బాధపడేవారు చింతపండు తీసుకుంటే మంచిది.

1 / 5

చింతపండు శరీరం గ్లూకోజ్ వినియోగాన్ని పెంచడమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయిలను కూడా నియంత్రిస్తుంది. గుండె సమస్యల్ని పోగొట్టడానికి చింతపండు బాగా పనిచేస్తుంది. చింతపండు చెడు కొలెస్ట్రాల్‌ను కరిగిస్తుంది. చింతపండు తింటే శరీరంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెరుగుతుంది. దీంతో గుండె సమస్యలు రావు. చింతపండు శరీరం గ్లూకోజ్ వినియోగాన్ని పెంచడమే కాకుండా రక్తంలో చక్కెర స్థాయిలను కూడా నియంత్రిస్తుంది. గుండె సమస్యల్ని పోగొట్టడానికి చింతపండు బాగా పనిచేస్తుంది. చింతపండు చెడు కొలెస్ట్రాల్‌ను కరిగిస్తుంది. చింతపండు తింటే శరీరంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెరుగుతుంది. దీంతో గుండె సమస్యలు రావు.

2 / 5

షుగర్ ఉన్న వాళ్లు చింతపండు తీసుకుంటే మంచిది. షుగర్ ఉన్న వాళ్ళు చింతపండు తీసుకోవడంతో ఇన్సులిన్ ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు కంట్రోల్ అవుతాయి. చింతపండును తీసుకోవడం వల్ల చర్మం హైడ్రేట్‌గా ఉంటుంది. పొడి చర్మం సమస్య దరి చేరదు. చర్మం పగలడం వంటి సమస్యలు రావుషుగర్ ఉన్న వాళ్లు చింతపండు తీసుకుంటే మంచిది. షుగర్ ఉన్న వాళ్ళు చింతపండు తీసుకోవడంతో ఇన్సులిన్ ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు కంట్రోల్ అవుతాయి. చింతపండును తీసుకోవడం వల్ల చర్మం హైడ్రేట్‌గా ఉంటుంది. పొడి చర్మం సమస్య దరి చేరదు. చర్మం పగలడం వంటి సమస్యలు రావు.

3 / 5

జీర్ణక్రియను మెరుగుపరచడానికి చింతపండు అద్భుతంగా పనిచేస్తుంది. చింతపండులో పొటాషియంతో పాటుగా పాలీఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్ కూడా సమృద్ధిగా ఉంటాయి. చింతపండులో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వలన కలిగే నష్టాన్ని తగ్గించగలవు. చింతపండును తీసుకోవడం వల్ల ఆకలి కంట్రోల్ అవుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచడానికి చింతపండు అద్భుతంగా పనిచేస్తుంది. చింతపండులో పొటాషియంతో పాటుగా పాలీఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్ కూడా సమృద్ధిగా ఉంటాయి. చింతపండులో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వలన కలిగే నష్టాన్ని తగ్గించగలవు. చింతపండును తీసుకోవడం వల్ల ఆకలి కంట్రోల్ అవుతుంది.

4 / 5

చింతపండులో యాంటీ ఇన్ఫ్లమెటరీ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి వాపు, మంటను తగ్గించడానికి ఉపయోగపడతాయి. చింతపండు తింటే ఆర్థరైటిస్ లాంటి సమస్యలను కూడా తగ్గుతాయి. చింతపండును తీసుకోవడం వలన రోగ నిరోధకశక్తి కూడా పెరుగుతుంది. వివిధ రకాల అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండొచ్చు. ఆరోగ్యం బాగుంటుంది. చింతపండులో యాంటీ ఇన్ఫ్లమెటరీ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి వాపు, మంటను తగ్గించడానికి ఉపయోగపడతాయి. చింతపండు తింటే ఆర్థరైటిస్ లాంటి సమస్యలను కూడా తగ్గుతాయి. చింతపండును తీసుకోవడం వలన రోగ నిరోధకశక్తి కూడా పెరుగుతుంది. వివిధ రకాల అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండొచ్చు. ఆరోగ్యం బాగుంటుంది.

# పాలలో లవంగాల పొడి కలిపి తాగితే ఎన్ని లాభాలో తెలుసా..?



ప్రాచీన ఆయుర్వేద శాస్త్రంలో లవంగానికి ప్రత్యేక స్థానం ఉంది. దీని వాసనతో పాటు ఆరోగ్యానికి ఇచ్చే మేలు వల్ల ఇది మన జీవితంలో భాగమైంది. లవంగాలను పొడి చేసి పాలలో కలిపి తాగితే ఇది సాధారణ పానీయంగా కాకుండా శరీరానికి ఎన్నో రకాల లాభాలను అందించే ఔషధంగా మారుతుంది. లవంగాల్లో ప్రోటీన్, ఐరన్, కాల్షియం, కార్బోహైడ్రేట్లు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి తగినంత శక్తిని అందించి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. పాలతో కలిపిన లవంగాల పొడి ఈ పోషకాలను శరీరానికి త్వరగా అందజేసే శక్తిని కలిగి ఉంటుంది. లవంగాన్ని పాలలో కలిపినప్పుడు.. అందులో కార్మినేటివ్, స్టిమ్యులెంట్ లక్షణాలు బలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని రక్తప్రసరణను మెరుగుపరచడమే కాకుండా.. రక్తపోటును కూడా నియంత్రించడంలో సహాయపడతాయి. అధిక బీపీ సమస్య ఉన్నవారు ఈ పానీయం రోజూ తాగితే క్రమంగా ఆ సమస్యలో ఉపశమనం కనిపించవచ్చు. ఏకధాటిగా పని చేసి అలసటకు లోనయ్యే వారు లేదా శారీరక శక్తి తగ్గినట్లు అనిపిస్తే లవంగాల పొడి కలిపిన పాలు తాగడం వల్ల తక్షణ శక్తిని అందుకోవచ్చు. ఈ మిశ్రమం శరీరంలోని బద్ధకాన్ని పోగొట్టి చురుకుదనాన్ని పెంపొందించగలదు. ముఖ్యంగా ఉదయాన్నే లేదా రాత్రి నిద్రకు ముందు తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది. లవంగాల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, మెటబాలిజాన్ని వేగంగా నడిపించే గుణాలు.. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో సహాయపడతాయి. ఫలితంగా బరువు తగ్గాలనుకునే వారికి ఇది సహాయకారిగా మారుతుంది. ఆహారం సరైన రీతిలో జీర్ణమవడానికి ఇది దోహదం చేస్తుంది. పేగుల వ్యవస్థను శుభ్రపరచడం, హానికరమైన బ్యాక్టీరియా చేరకుండా చూడడం లవంగాల ముఖ్యమైన లక్షణాల్లో ఒకటి. పాలతో కలిపిన లవంగాల పొడి మిశ్రమం గ్యాస్ సమస్యలు, కడుపులో గందరగోళాలు, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గించగలదు. దీని వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా పనిచేస్తుంది. ఇంకా లవంగ పాలను నిత్యం తాగడం వల్ల ఎముకలు, దంతాలు బలంగా మారతాయి. ముఖ్యంగా వయస్సుతో వచ్చే ఎముకల బలహీనత, బోలు ఎముకల వ్యాధిని తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. ఇందులోని కాల్షియం, ఫాస్ఫరస్, మాంగనీస్ వంటి ఖనిజాలు ఎముకల పటుత్వాన్ని పెంపొందిస్తాయి. సాధారణంగా మనం లవంగాన్ని వంటలలో రుచి కోసం ఉపయోగిస్తుంటాము. కానీ దీన్ని పొడిగా తయారు చేసి పాలలో కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి చాలా విలువైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఇది సహజసిద్ధమైన రోగనిరోధక శక్తిని పెంచే ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల ఈ డ్రింక్ రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకుంటే శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది. అయితే అధిక మోతాదులో తీసుకోకూడదు. మితంగా మాత్రమే తీసుకోవాలి.